క్లుప్తంగా

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


సాయిబాబాను దర్శించుకుంటున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలోని షిర్డీ సాయిబాబా 24వ ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. అష్టోత్తర శత కలశ స్నపనం, హోమాలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం గౌరీ సురేష్ శర్మ ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నసమారాధనను ప్రారంభించారు. 2 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. నాయకులు అయిత ఎర్రయ్య, దువ్వి అప్పారావు, కంచిబోయిన సంతోష్, యల్లపు కృష్ణ, బొట్ట గోవింద్, టైల్స్ రాజు, భక్తులు బాబాను దర్శించుకున్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం రేపు


ప్రారంభోత్సవానికి సిద్ధమైన అభయాంజనేయస్వామి ఆలయం

పెందుర్తి : మండలంలోని పినగాడి పంచాయతీలోని వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా హాజరు కావాలని కోరారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం


సింహగిరి మెట్లమార్గంలో కొలువుదీరిన ఆంజనేయస్వామి

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలో కొలువుదీరిన ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8గంటల నుంచి గణపతిపూజ, పుణ్యాహవాచనం, సుందరకాండ పారాయణం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు స్వామికి అభిషేకం, సహస్రనామార్చన, సుందరకాండ పారాయణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం 6.30గంటలకు పంచామృతాభిషేకం, 7గంటలకు సహస్రనామార్చన, ఉదయం 9గంటల నుంచి శ్రీరామ పట్టాభిషేక సర్గ పారాయణం, 9.30గంటలకు పూర్ణాహుతి ఉంటాయని పేర్కొన్నారు.

పోలీసులకు వైద్య సేవలు


మల్కాపురం పీఎస్‌లో పోలీసులకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

మల్కాపురం: విధి నిర్వహణలో ఉండే పోలీసుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉన్నతాధికారుల ఆదేశాలతో మల్కాపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పోలీసులకు బీపీ, సుగర్, రక్తహీనత, ఇతర సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో స్టేషన్ పరిధి లా అండ్ ఆర్డర్, క్రైం, ట్రాఫిక్ పోలీసులు పాల్గొని టెస్టులు చేయించుకున్నారు.

18న పైడితల్లి అమ్మవారి పండగ

- 9న సత్తెమ్మ పర్వదినం
- ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లండ వెంకటరమణ ప్రకటన

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి వార్షిక పండగను వచ్చే నెల 18వ తేదీ మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు పూజారి వంశీయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లండ వెంకటరమణ ప్రకటించారు.


అమ్మవారి పండగ నిర్వహణకు సంబంధించి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వెంకటరమణ, అడవివరం గ్రామస్తులు, అమ్మవారి సేవకులతో గురువారం సింహాచలం దేవస్థానం అధికారులు సమావేశం నిర్వహించారు. వారి నుంచి సూచనలు, సలహాలను స్వీకరించారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ జూన్ 9న అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మ(మరిడమ్మ) పండగ, 10వ తేదీన పైడితల్లి, ముత్యాలమ్మతల్లి అమ్మవార్ల దేవర (పుట్టమన్ను) తెచ్చే కార్యక్రమం, 11వ తేదీన ముత్యాలమ్మ పండగ జరపనున్నట్లు తెలిపారు. 17న పైడితల్లి అమ్మవారి తొలేళ్ల మహోత్సవం, 18వ తేదీన పైడితల్లి పండగ మహోత్సవం(అనుపు), 25న మారువారం పండగ జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు లండ వెంకటరమణ దేవస్థానం అధికారులకు అంగీకార పత్రం అందజేశారు. పైడితల్లి అమ్మవారి పండగను వైభవంగా జరపాలని దేవస్థానం అధికారులను కోరారు.


పండగ తేదీని ప్రకటిస్తున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లండ వెంకటరమణ

గ్రామస్తుల విజ్ఞాపనలు

ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు తమ అభ్యర్థనలను దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

- పండగ సందర్భంగా గ్రామంలో విద్యుత్ కాంతులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని కోరారు.
- పండగ రోజు రాత్రి గ్రామస్తులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసుకునే సాంస్కృతిక కార్యక్రమాలను కొన్నేళ్ల నుంచి రాత్రి 10 గంటలకే పోలీసులు నిలుపుచేస్తున్నారని, అమ్మవారు అనుపు మహోత్సవం సమయానికి ముందే సాంస్కృతిక కార్యక్రమాలు నిలిపివేయడం జరుగుతోందని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై దేవస్థానం కల్పించుకుని పోలీస్ అధికారులతో మాట్లాడాలని కోరారు.
- తొలేళ్ల రోజు దేవస్థానం ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలు కూడా అమ్మవారు మార్కెట్‌లోకి వచ్చేవరకు ఉండాలన్నారు.
- అమ్మవారి పూజారులకు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో దేవస్థానం ఉద్యోగం కల్పించాలని కోరారు.


పైడితల్లి అమ్మవారు

- అమ్మవారి ఆలయం వద్ద బాత్‌రూమ్‌ల సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తుడు సతివాడ శంకరరావు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దేవస్థానం అనుమతిస్తే తానే బాత్‌రూమ్‌లు నిర్మిస్తానని సభాముఖంగా తెలిపారు.
- పురటాలమ్మ ఆలయం విగ్రహం వద్ద విద్యుద్దీప కాంతులు ఏర్పాటు చేయాలని కోరారు.

సమావేశంలో దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈవోలు వి.బి.వి. రమణమూర్తి, నరసింహరాజు, పాలూరి నరసింగరావు, సూపరింటెండెంట్లు యనమండ్ర అప్పారావు, అప్పలనాయుడు, అడవివరం కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, గ్రామస్తులు కొలుసు ఈశ్వరరావు, ఎర్ర వరహా నరసింహం, కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, తోమురోతు రాము, బంటుబిల్లి మహేష్, మజ్జి సూరిబాబు, బొట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

- వైభవంగా స్వర్ణ పుష్పార్చన
- శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

కనులపండువగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం 9.30 గంటల నుంచి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడా మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు అర్చకులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.


నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు


గ్రంథాలయానికి గోడ గడియారం బహూకరిస్తున్న దాత పెంటకోట గణేష్

పెందుర్తి : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు. గురువారం కథలు చదవడం, రాయడం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ధ్యానం చేశారు. అనంతరం పేపర్ క్రాఫ్ట్ ద్వారా తమలోని సృజనాత్మకతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందించారు. యోగా గురువు లక్ష్మీప్రసన్న విద్యార్థులకు వజ్రాసనం, సుఖాసనం, వృక్షాసనం తదితర ఆసనాలు నేర్పించారు. గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పెతకంశెట్టి భూలోకరావు మైక్ సెట్, కమిటీ సభ్యుడు పెంటకోట గణేష్ గోడ గడియారం గ్రంథాలయానికి అందజేశారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కర్రి సత్యనారాయణ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.


విద్యార్థులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పౌష్టికాహారంపై అవగాహన

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వై. స్వర్ణలత ఆధ్వర్యంలో జరిగింది. ఈ శిబిరంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్ రాంబాబు, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన రత్నకుమార్, వైద్య సిబ్బంది పీహెచ్‌ఎం రత్నాబాయి, ఏఎన్‌ఎం అనురాధ, గ్రంథాలయ అధికారి వి. శిరీష, ఆశ వర్కర్ ఎస్. సూర్యకుమారి, పి. దుర్గాదేవి, ఎస్. శాంతి కుమారి, విజయ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాస విత్తనాలు సిద్ధం

పరవాడ: పశుసంవర్ధక శాఖ ద్వారా రాయితీపై పశుగ్రాస విత్తనాలు సరఫరాకు సిద్ధంగా ఉన్నాయని పరవాడ పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టరు రామకృష్ణ కీర్తి తెలిపారు. స్థానిక పశు వైద్యశాలలో గురువారం ఏర్పాటు చేసిన డివిజినల్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 75 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను సరఫరా చేస్తామని చెప్పారు. అవసరమైన రైతులు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు. పశు బీమా, పశువులకు జబ్బవాపు, గొర్రెలకు చిటికెల వ్యాధికి టీకాల కార్యక్రమం నిర్వహించడానికి సిబ్బందిని సంసిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో భాగంగా పశు గణన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వేసవిలో పశువులు వేడిగాడ్పుల బారిన పడకుండా తీసుకోవలసిన చర్యలపై ఏడీ పలు సూచనలు చేశారు. సమావేశంలో డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టరు అశ్విని, కాళ్ల శ్రీను, పశుసంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ రామకృష్ణకీర్తి

రహదారి పక్కన పొదల తొలగింపు


రావాడలో ముళ్ల పొదలను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: 'పొదల మాటున ముప్పు' శీర్షికన ఈ నెల 27న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రావాడ పంచాయతీ పరిధిలో రోడ్ల పక్కన దట్టంగా పెరిగిన ముళ్ల పొదల కారణంగా ప్రయాణికులు, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. పంచాయతీలో పలు గ్రామాల రహదారులకు ఇరువైపుల పెరిగిన ముళ్ల పొదలను పంచాయతీ అధికారి అనురాధ గురువారం జేసీబీతో తొలగింపజేశారు. దీంతో రహదారి విశాలవంతమై రాకపోకలకు మరింత సులువయింది. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన పంచాయతీ అధికారి అనురాధకు ఈ సందర్భంగా స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

పరవాడ: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని పెదముషిడివాడలో అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సదస్సులో డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ ఏ ఒక్కరు ఎన్నికల నిబంధనలు అతిక్రమించినా సహించేది లేదన్నారు. కౌంటింగ్ సందర్భంగా మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి గొడవలకు దిగినా పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరు సహకరించాలని కోరారు. ఈ సదస్సులో సీఐ ఎస్.బాలసూర్యారావు, ఎస్‌ఐలు మల్లేశ్వరరావు, శ్యామలరావు, సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

శిథిలమైన వంతెన రక్షణ గోడ


ముత్యాలమ్మపాలెం రహదారిలో వంతెనపై శిథిలమైన రక్షణ గోడ

పరవాడ : ముత్యాలమ్మపాలెం-వాడచీపురుపల్లి రహదారిలో ముత్యమాంబ ఆలయం సమీపంలోని వంతెనపై నిర్మించిన రక్షణ గోడ శిథిలం కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని అంతా ఆందోళన చెందుతున్నారు. ఆ రహదారిలో సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెనపై ఇరువైపుల నిర్మించిన రక్షణ గోడలు శిథిలమై పడిపోయాయి. ప్రస్తుతం వంతెనపై ఎలాంటి రక్షణ లేక వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం రహదారిలో వందల సంఖ్యలో భారీ, చిన్న వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ విద్యుద్దీపాలు లేకపోవడం, వంతెనకు రక్షణ గోడలు లేకపోవడం కారణంగా చాలా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఐదేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనులు చేపట్టినప్పటికీ వంతెనకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. అదే విధంగా వంతెనను విస్తరించని కారణంగా వంతెన మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో కనీసం సైకిల్ కూడా ప్రయాణించే వీలు లేకుండా ఉంది. రాత్రి సమయంలో ఈ వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు ఈ వంతెనను విస్తరించి, మరమ్మతులు చేపట్టాలని స్థానిక మత్స్య కార్మికులు, ప్రజలు కోరుతున్నారు.

సాయిబాబాకు విశేష పూజలు


పూజలందుకుంటున్న సాయిబాబా

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు బాబాకు విభూది, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు బాబా కీర్తనలను ఆలపించారు. మధ్యాహ్నం మందిరం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సాయిబాబాకు విశేష పూజలు, ఊయాల సేవ నిర్వహించారు. స్థానిక భక్తుడు బాబా మందిర నిర్వహణకు రూ.5 వేలను విరాళంగా అందించారు.


రూ.5 వేల విరాళం అందిస్తున్న దాత

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి


బైక్ నంబర్ ప్లేట్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పారావు

మల్కాపురం: పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు అర్ధరాత్రి వేళలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహన చోదకులను హెచ్చరించి, జరిమానాలు విధిస్తున్నారు. మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు బుధ, గురువారాల్లో రాత్రి సమయంలో శ్రీహరిపురం, మల్కాపురం, కోరమాండల్ మొదలగు ప్రధాన కూడళ్ల వద్ద గస్తీ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని ఆపి ధ్రువపత్రాలను, నంబర్ ప్లేట్లను పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్‌తో వాహనాల నడిపిన వారిపై కొరడా ఝుళిపించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పారావు మాట్లాడుతూ వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించరాదన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ డ్రైవింగ్, అతి వేగం, మైనర్ డ్రైవింగ్ తదితర నిబంధనలు పాటించని వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకుని, జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు.

'కేంద్రం కుయుక్తులు చెల్లవు'

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా చెల్లవని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు వై.మస్తానప్ప, డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు అన్నారు. వాటిని అడ్డుకునే శక్తి ఆంధ్రులకు ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో 1204వ రోజు, గురువారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ ప్రభావం ఉత్తరాదిలో తగ్గుతోందన్నారు. కేవలం కేంద్రం అనుసరించే కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలే బీజేపీ ప్రభుత్వ పతనానికి నాంది కానున్నాయన్నారు. కార్యక్రమంలో దేవులపల్లి సంపూర్ణం, ఎం.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ముగ్గురమ్మల నవరాత్రి మహోత్సవాలు

- వైభవంగా బంగారుమాంబ అనుపోత్సవం


బంగారుమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామ దేవతలైన బంగారుమాంబ, నూకాంబిక, దుర్గాలమ్మ వార్ల నవరాత్రి పండగ మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగ్గురమ్మ వార్ల ఉత్సవాలను ఈ నెల 22 నుంచి కనులపండువగా జరిపించారు. ముగ్గురమ్మ వార్లతో పాటు గ్రామంలో కొలువైయున్న సత్తెమ్మ తల్లికి కూడా పూజలు చేశారు. నిత్యం కుంకుమార్చనలు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, పండగ సంబరాలతో నాతయ్యపాలెం గ్రామంలో తొమ్మిది రోజుల పాటు పండగ సందడి నెలకొంది. ఉత్సవాల ముగింపు సందర్భంగా బంగారుమాంబ అమ్మవారిని గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రాత్రి ముగ్గురమ్మల ఘటాలను వీధుల్లో ఊరేగించారు. సాము గరిడీ, తప్పెట గుళ్ల, స్టేజి సెట్టింగ్‌తో ప్రధాన దేవత బంగారుమాంబ అమ్మ వారి అనుపోత్సవం జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించింది.


దుష్టశక్తులు వాలకుండా సత్తెమ్మ తల్లి ఘటాన్ని కర్రలతో కాపలా కాస్తూ, ఊరేగిస్తున్న భక్తులు

కథలతో విజ్ఞానం, వికాసం


విద్యార్థులకు కథాసారం వివరిస్తున్న ఉపాధ్యాయుడు వరప్రసాద్

పెదగంట్యాడ: విజ్ఞానాన్ని సముపార్జించే కథలను విద్యార్థులు చదవాలని స్థానిక ఉపాధ్యాయుడు వరప్రసాద్ అన్నారు. పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం పెంపొందడంతో పాటు వ్యక్తిత్వం వికసిస్తుందన్నారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు కథలను బోధించారు. అనంతరం విద్యార్థులతో ఆటలు ఆడించారు. గ్రంథాలయాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నవ్య, కుమారి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం


కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

గాజువాక: స్థానిక పాతకర్ణవానిపాలెం గ్రామదేవతలు పైడితల్లి, దుర్గమాంబ అమ్మవార్ల పండగ సందర్భంగా పలువురు కళాకారులను కేఎన్నార్ ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావు ఘనంగా సత్కరించారు. శ్రీనగర్‌కు చెందిన కొరియోగ్రాఫర్ రమేష్ మాస్టర్, పల్సర్ బైక్ గాయకుడు రమణ, డ్యాన్స్ మాస్టర్ బాలును ఆయన సత్కరించారు. కార్యక్రమంలో కరణంరెడ్డి కుటుంబ సభ్యులు జ్యోతి, సాహితి, చిరు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలు బడిలో ఉండాలి

మల్కాపురం: బడి ఈడు దివ్యాంగ బాలలు బడిలో ఉండాలని ఎంఈవో వెంకటరావు అన్నారు. ములగాడ మండలం భవిత కేంద్రంలో నమోదు కాకుండా బడి బయట ఉన్న దివ్యాంగ బాలలను గుర్తించే సర్వే గురువారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మల్కాపురం, అంబేడ్కర్ కాలనీలో సర్వే చేసినట్లు తెలిపారు. ఇక్కడ ఓ చిన్నారిని గుర్తించామన్నారు. ఆ చిన్నారిని భవిత కేంద్రంలో చేర్పించాలని తల్లిదండ్రులతో చెప్పామన్నారు. ఇప్పటి వరకు 13 మంది దివ్యాంగ బాలలను గుర్తించినట్లు వివరించారు. జూన్ 9 వరకు ఈ సర్వే చేస్తామన్నారు. ఉపాధ్యాయులు బాలకృష్ణనాయుడు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.